క్లుప్తంగా

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేత



కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కామారెడ్డి కాంగ్రెస్ నేత గడ్డం చంద్రశేఖర్ రెడ్డి హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీతో కలిసి ముఖ్యమంత్రిని సన్మానించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజరాజేశ్వరాలయానికి రూ.3 లక్షల విరాళం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్లపేట శివారులోని రాజరాజేశ్వరాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వారాల శ్రావణ్ కుమార్ తరఫున ఆయన తండ్రి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం రూ.3 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గణపతి, కిషన్, భూమయ్య, గంట సాయిలు తదితరులున్నారు.

'ఎన్నికల కమిషన్ ఉత్తరానికి గాబరా పడొద్దు'

కామారెడ్డి అర్బన్: ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఒక వ్యక్తి పేరున రెండు చోట్ల ఓటు ఉంటే తొలగించడానికి ఎన్నికల కమిషన్ ఫార్మాట్-ఏ ద్వారా ఇంటికి రిజిస్టర్ పోస్టు ద్వారా ఉత్తరం పంపుతుందని కామారెడ్డి తహసీల్దార్ బి.జనార్దన్ తెలిపారు. ఉత్తరం వచ్చిన వారు గాబరా పడకుండా దాన్ని తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారి(బీఎల్‌వో)కి చూపించి తమకు అనుకూలంగా ఉన్న చోట ఓటరు జాబితాలో పేరు ఉంచుకుని మిగతా చోట తొలిగించుకోవాలని సూచించారు. అలాగే మరణించిన వారి పేర్లు సైతం తొలగిస్తారన్నారు. ఈనెల 22 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ రావు 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 7 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఒక్కరికి నల్ల పాప మీద తెల్ల పాప ఉన్నట్లు గుర్తించి నిజామాబాద్ కంటి ఆసుపత్రికు రిఫర్ చేశారు. 14 మందికి కంటి అద్దాలను రిఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, డీసీ వేణుగోపాల్, సభ్యులు లక్ష్మినారాయణ, సంతోష్, రాజు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో..



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి వివేకానంద లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా సీనియర్ సిటిజన్ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గాంధీ ఆస్పత్రి, గాయత్రి స్కిన్, ఈఎన్‌టీ, మ్యాక్స్ కేర్ ఆస్పత్రుల వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీనియర్స్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పి.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎం.రాజన్న, వివేకానంద లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.అశోక్, జోనల్ చైర్మన్ నరసింహం, సీనియర్ సిటిజన్ ఫోరం ప్రతినిధులు మోహన్‌రెడ్డి, విశ్వనాథం, రాజారెడ్డి, రాంకిషన్, నరసింహన్, అశోక్‌రావు, కాసర్ల రామచంద్రం, సాయాగౌడ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

రుణం చెల్లించని ఇల్లు సీజ్

భిక్కనూరు: మండల కేంద్రంలో బ్యాంక్ రుణం చెల్లించని మహిళ ఇంటిని శుక్రవారం బ్యాంక్, రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ స్థానిక కెనరా బ్యాంక్‌లో రూ.12 లక్షల రుణం తీసుకుని ఇంటిని నిర్మించారు. దానికి రూ.లక్ష యాభై వేల వడ్డీ అయ్యింది. ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా డబ్బులు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు చంద్రభూషణ్, భార్గవ్ సుధీర్‌లు తహసీల్దార్ శివప్రసాద్, ఏఎస్సై జగదీష్‌లతో కల్సి వచ్చి సదరు ఇంటిని సీజ్‌చేశారు. ఏడాది కాలంగా నోటీసులు జారీ చేసినా డబ్బులు చెల్లించకపోవడంతో నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇంటిని అమ్మగా రూ.9.50 లక్షలు వచ్చాయన్నారు. మిగతా డబ్బులను ఆ మహిళ వద్ద నుంచి వసూలు చేస్తామన్నారు.

కంపుకొడుతున్న బస్టాండ్



బాన్సువాడ బస్టాండ్‌లో బస్సు దిగే ఎక్కే సమయంలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్‌లో నిల్వ ఉన్న మురికి నీరు

- దుర్వాసన వెదజల్లుతున్న ప్రాంగణం
- మురికి నీటి నిల్వతో ప్రయాణికులకు ఇబ్బందులు

బాన్సువాడ : బాన్సువాడ బస్టాండ్ కంపుకొడుతోంది. బస్టాండ్ ప్రాంగణంలో మురికి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు సంక్రాంతి పండగ పురస్కరించుకుని దూర ప్రాంతాల్లో ఉండే వారు సొంతూళ్లకు పయనమవుతున్నారు. బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. బస్సుల్లో వచ్చి పోయే ప్రయాణికులు వాసన తట్టుకోలేకపోతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లే బస్సులు మురికి నీరు నిల్వ ఉండే ప్రాంతంలోనే ఆపడంతో ప్రయాణికులు ముక్కు మూసుకుంటూ బస్సులు దిగుతున్నారు. బస్టాండ్ ప్రాంతం ఇంత కంపుకొడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిల్వ ఉన్న మురికినీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న హిందూవాహిని నాయకులు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మత బోధనలు చేస్తున్నారని, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హిందూవాహిని ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి కార్యాలయాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హిందూవాహిని రాష్ట్ర బోధన ప్రముఖ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పట్టణంలో స్పార్క్‌మైండ్ పాఠశాలలో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా మత బోధనలు చేస్తున్నారని, అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు లేరని, ఆర్టికల్ 28(3) ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతి లేనిదే మత బోధనలు చేయరాదని అన్నారు. గుర్తింపు రద్దు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. హిందూ వాహిని జిల్లా కన్వీనర్ సాయికిరణ్, జిల్లా ప్రచార ప్రముఖ్ సునీల్‌రావు, కామారెడ్డి టౌన్ కన్వీనర్ తరుణ్, సభ్యులు ఉన్నారు.

సర్వర్ డౌన్ పేరిట అధిక వసూళ్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారు. బాధితులు వివిధ పథకాల కోసం నెట్ సెంటర్లకు వెళ్తే సర్వర్ డౌన్ అంటూ కాలయాపన చేస్తున్నారు. అదనంగా డబ్బులు చెల్లిస్తే పనులు చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో నాలుగు నెట్‌కేఫ్‌లు ఉన్నాయి. అన్ని నెట్‌కేఫ్‌లలో అదే పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. వెహికల్ చలాన్ కట్టాలంటే అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. అలాగే విశ్వకర్మ పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలంటే రూ.100 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని నిర్వాహకులను బాధితులు ప్రశ్నిస్తే అది అంతే అని సమాధానం ఇస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అదనంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 13వ వార్డు కౌన్సిలర్



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లోని 13వ వార్డు కౌన్సిలర్ శంకర్‌రావు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వార్డు అభివృద్ధి కోసం, కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కౌన్సిలర్ తెలిపారు. వరుసగా బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్‌లో 10 మంది కౌన్సిలర్‌లు చేరగా పాత వారితో కలిసి మొత్తం కాంగ్రెస్ కౌన్సిలర్‌ల బలం 14కు చేరుకుంది. నాయకులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, గోనె శ్రీనివాస్ తదితరులున్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో తరచుగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. చిట్యాలలో గురువారం రాత్రి తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించి సైబర్ నేరగాళ్ల చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బైక్‌లు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే 100 నంబరుకు సమాచారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గ్రామ పెద్దలు బాలయ్య, రవీందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, పోలీసు కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

జీపీ అక్రమాలపై విచారణ జరిపించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న అక్రమాలపై అధికారులు విచారణ జరపాలని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల సీనియర్ అసిస్టెంట్ విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఇళ్ల నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్, ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇంటి నిర్మాణానికిగాను కొంత మంది దగ్గర రూ.14 వేలు తీసుకుని రూ.982లకు రసీదు ఇచ్చారని ఆరోపించారు. కొలాస్ సంజీవ్ అనే వ్యక్తి రేకుల షెడ్ నిర్మాణం కోసం రూ.25 వేలు తీసుకొని రూ.8,800 కు రసీదు ఇచ్చారని మిగిత డబ్బులకు రసీదు ఇవ్వకుండా లంచం కింద ఉంచుకున్నారని ఆరోపించారు. పంచాయతీ తరఫున పారిశుధ్య పనులు చేయకున్నా చేసినట్లుగా, వీధి దీపాలు పెట్టకున్నా పెట్టినట్లుగా బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నింటిపై అధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు చిప్ప మోహన్, కల్లూరి బల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి



దోమకొండ: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని దోమకొండ ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలిని కలుపుకుని దోమకొండ రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 20 మంది యువకులు శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీపీఎం చల్లా సుధాకర్, రక్తదాన సమూహ నిర్వాహకులు బాలే సురేందర్, గాజులపల్లి గోపాల్ రెడ్డి, పద్మశాలి సంఘం ప్రతినిధులు బొమ్మెర గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



శివాయిపల్లిలో పాఠశాలలో ..



పెద్దకొడప్‌గల్ గురుకుల బాలికల పాఠశాలలో భోగి పండుగ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రాజంపేట/పెద్దకొడప్‌గల్: శివాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, గాలిపటాల తయారీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదే విధంగా పండగను ఉద్దేశించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ముదాం స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కూడా వేడుకలు నిర్వహించారు.

జాతీయ యువజన దినోత్సవం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు ఉన్నత పాఠశాల నుంచి కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుండా రెండు కిలో మీటర్ల వరకు పరుగెత్తారు.

రన్ ఫర్ నేషన్



రామారెడ్డిలో 2కే రన్ నిర్వహిస్తున్న సభ్యులు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): స్వామి వివేకానంద 161వ జన్మదినం సందర్భంగా మండల కేంద్రం రామారెడ్డిలో రన్ ఫర్ నేషన్ పేరుతో 5:30 బ్యాచ్ సభ్యులు గురువారం 2కే రన్ నిర్వహించారు. రామారెడ్డిలోని కాలభైరవ స్వామి ఆలయం నుంచి రెడ్డి సబ్ స్టేషన్ వరకు ఈ 2కే రన్ నిర్వహించగా యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో 5:30 బ్యాచ్ సభ్యులు గుర్తుకుంట స్వామి, పడియాల శ్రీనివాస్, బాలదేవ్ అంజయ్య, కురుమ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



సంగంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ పాల్త్య విఠల్



కేంరాజ్‌కల్లాలిలో ..

సాక్షి నెట్‌వర్క్: స్వామి వివేకానంద జయంతిని జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ.. వివేకానందను స్ఫూరిగా తీసుకొని యువత ముందుకు సాగాలని సూచించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పిన మహనీయుడు ఆయన అని కొనియాడారు.



జిల్లా కేంద్రంలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి



బాన్సువాడలో .. బీజేపీ నాయకులు



భిక్కనూరు మండలం జంగంపల్లిలో ..



దోమకొండలో ..



ఎల్లారెడ్డిరూరల్: భిక్కనూర్‌లో..



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..



తాడ్వాయి మండలం ఎండ్రియాల్‌లో ..



రామారెడ్డిలో ..



పిట్లంలో ..



జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు



ఇన్‌చార్జి డీసీవోకు నోటీసు అందజేస్తున్న డైరెక్టర్లు

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ చైర్మన్ లింగంరెడ్డిగారి సుకన్య, వైస్‌చైర్మన్ బండారు కిష్టారెడ్డిలపై డైరెక్టర్లు శుక్రవారం ఇన్‌చార్జి డీసీవో సింహచలానికి అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేశారు. శెట్పల్లిసంగారెడ్డి సొసైటీలో 13 మంది డైరెక్టర్లు ఉండగా 10 డైరెక్టర్లు అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేసి డీసీవోకు అందజేశారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సంఘ కార్యవర్గంలో విశ్వాసం కోల్పోయినట్లు వారు పేర్కొన్నారు. దాంతో అవిశ్వాస తీర్మానం పరిశీలించటానికి సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



రామారెడ్డి (ఎల్లారెడ్డి): క్రీడా గ్రామంగా పేరుగాంచిన రామారెడ్డిలో సంక్రాంతి సెలవుల సందర్భంగా రామారెడ్డి ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు కొనసాగనుంది. మొదటి బహుమతి రూ.11వేల నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.8 వేలతో పాటు ట్రోఫీ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేషనల్ ప్రీమియర్ లీగ్‌లో ఐశ్వర్య ప్రతిభ



బహుమతి, ప్రశంసా పత్రంతో ఐశ్వర్య

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కాకతీయనగర్ మౌంట్ కార్మెల్ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి రెడ్డి ఐశ్వర్య హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ నేషనల్ ప్రీమియర్ లీగ్-2024(సీజన్-5) డ్యాన్స్ పోటీలో ప్రతిభ కనబర్చి అవార్డు గెలుచుకుంది. ఐశ్వర్య అవార్డు అందుకోవడంతో తల్లిదండ్రులు కృష్ణవేణి, సుధాకర్‌లు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు, బంధువులు అభినందనలు తెలిపారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ కార్యకర్తలను ఆదుకుంటాం

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను ఆదుకుంటామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చాకలి సంగయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. నాలుగు రోజుల కిందట సంగయ్య గుండెపోటుకు గురై మృతి చెందారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు. నాయకులు రవీందర్ రెడ్డి, మల్లయ్యగారి ఆకాష్, సాయాగౌడ్, ప్రవీణ్ యాదవ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రియాంక జన్మదిన వేడుకలు

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిజాంసాగర్ మండలంలోని ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే తోట.లక్ష్మీకాంతరావు పాల్గొని కేక్ కట్ చేశారు. నాయకులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, మనోజ్ పటేల్, తదితరులు ఉన్నారు.

దైవభక్తి పెంపొందించుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ప్రతి ఒక్కరు దైవభక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం కందర్‌పల్లిలో శ్రీరాముడి అక్షింతల వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కుప్రియాల్‌లో కుంకుమ పూజలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లోని శ్రీ రామాలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో టీటీడీ నిర్వాహకులు సీతారామచంద్ర స్వామి, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ స్వరూపారెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్‌గౌడ్, భజన మండలి ప్రతినిధులు రాజిరెడ్డి, జైపాల్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి శ్రీగోదా రంగనాథస్వామి ఆలయంలో ఈనెల 13న ఉదయం 9.30 గంటలకు 23వ(త్రయోవింశ) స్వామి వారి కల్యాణ ఉత్సవం నిర్వహించనున్నట్లు చాత్తద శ్రీవైష్ణవ సంఘం గౌరవ అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కల్యాణోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

లింగాపూర్‌లో..

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని లింగాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు గోదా రంగనాథుల స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఇంటి గోడలపై 'జై శ్రీరామ్'



భిక్కనూరు: మండల కేంద్రంలో ఇంటి గోడలపై జై శ్రీరామ్ అక్షరాలను శ్రీరామదండు ప్రతినిధులు శుక్రవారం పెయింట్ వేశారు. మండల కేంద్రంలో ఇంటి యజమానుల అనుమతితో శ్రీరామ అక్షరాలను పెయింట్ వేస్తున్నామని శ్రీరామదండు ప్రతినిధులు తెలిపారు.